క్లుప్తంగా

అన్నదానం ట్రస్టుకు రూ.11 లక్షలు విరాళం



విరాళాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేస్తున్న దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారి అన్నదానం ట్రస్ట్‌కు తిరుపతికి చెందిన ప్రణీత్, నిహారిక దంపతులు 11 లక్షల 16 వేల రూపాయలు విరాళాన్ని టీటీడీ ఈఓ ధర్మారెడ్డికి శుక్రవారం అందజేశారు. విరాళాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి క్యాంపు కార్యాలయంలో అందుకున్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



లోకేష్‌బాబు, పీవీఎస్ఎన్ రాజు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం యూటీఎఫ్ మండల కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఇందులో మండల అధ్యక్షుడిగా లోకేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్ఎన్ రాజు, గౌరవాధ్యక్షుడిగా బాబురెడ్డి, సహాధ్యక్షులుగా రాజేష్, పరమేశ్వరి, ట్రెజరర్‌గా హరిక్రిష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా యూటీఎఫ్ తిరుపతి జిల్లా కోశాధికారి రమేష్, ఎన్నికల అధికారిగా నిర్మల వ్యవహరించారు.

రేపు పౌర్ణమి పూజలు



తిరుపతి, కల్చరల్: నగరంలోని అన్నారావు సర్కిల్ వద్ద వెలసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీన కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు లక్ష్మీపతి తెలిపారు. ఉదయం శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి అభిషేక పూజలు, అలంకరణలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తు న అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అన్నదానానికి ధన, వస్తు రూపేణా సాయం చేయవచ్చని కోరారు. ఆలయంలో కార్తీక మాస శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు కార్తీక వనమహోత్సవం

భాకరాపేట: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు యడమవారిపల్లె చిన్మయ మిషన్ స్వామి శ్రీకృష్ణానంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు శ్రీతులసీ మాత పూజ, శ్రీ అమలక దామోదర స్వామి పూజలు, మధ్యాహ్నం 12.30 నుండి 1.00 గంట వరకు నెల్లిచెట్టు (ఉసిరి) వద్ద కార్తీక దీపాలు వెలిగించు కార్యక్రమం, మహా మంగళ హారతి జరుపబడునని తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1 గంట నుండి కార్తీక వనభోజనం(అన్నదానం) కార్యక్రమం ఉంటుందన్నారు. యడమవారిపల్లె, పులిచెర్ల, పీలేరు చిన్మయ మిషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పై కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

2 నుంచి శ్రీ వేదనారాయణ స్వామికి బాలాలయ పూజలు

తిరుపతి(అలిపిరి): నాగలాపురం శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో డిసెంబరు 2 నుంచి 7 వరకు 'బాలాలయం' కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరుగనున్నట్లు టీటీడీ శుక్రవారం టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. డిసెంబరు 2న ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం, సాయంత్రం 6 గంటల నుంచి మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, వాస్తు హోమం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 3న ఉదయం అకల్మష హోమం, రక్షాబంధనం, సాయంత్రం కుంభస్థాపన, కళాకర్షణ, అగ్నిప్రతిష్ఠ, కుంభాలను యాగశాలకు తీసుకొచ్చి వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.సాధారణంగా గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం బాలాలయం పూజలు చేపడుతారు. 7న ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, కుంభ ప్రదక్షిణ దివ్యప్రబంధ శాత్తుమొర నిర్వహిస్తారు. ఉదయం 9.20 నుంచి 10.10 గంటల మధ్య మకర లగ్నంలో బాలాలయ సంప్రోక్షణం చేపట్టనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

జగనన్నతోనే మహిళల అభ్యున్నతి

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళల సాధికారత, అభ్యున్నతి సాధ్యమైందని తిరుపతి కొర్లగుంటకు చెందిన టీడీపీ మహిళా నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్ఆర్ సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఈ మేరకు కొర్లగుంటలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సీపీలో చేరారు. పార్టీలో చేరుతున్న చెర్లోపల్లి విజయరాయల్, భారతితో పాటు నేతలు, కార్యకర్తలకు టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయరెడ్డి, ముద్రనారాయణ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎవరో వస్తారు..ఏదో చేస్తారని ఎదురుచూసి అలసిపోయిన మహిళా లోకానికి నేనున్నానంటూ భరోసా కల్పించిన ఏకైక నాయకుడు జగనన్న అని వైఎస్ఆర్ సీపీలో చేరిన నేతలు కొనియాడారు. సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించిన జగనన్నే మాకు దేవుడన్నారు. అమ్మ ఒడి, వైఎస్ఆర్ ఆసరా, జగనన్న చేయూత, కాపునేస్తం వంటి పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని వివరించారు. లక్షలాది మంది సొంతింటి కల నెరవేర్చిన మహానుభావుడు జగనన్న అన్నారు. అలాంటి నాయకుడు మళ్లీ అధికారంలోకి రావాలనే ఆలోచనతోనే వైఎస్ఆర్ సీపీలో చేరినట్లు వెల్లడించారు. చంద్రబాబు పాలనలో మహిళలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. చంద్రబాబుకు అధికార దాహం తప్ప ప్రజలకు మేలు చేయాలన్న చిన్నపాటి ఆలోచన కూడా లేదని విమర్శించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ దేశంలో మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టిందని, అయితే జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అతివలకు పెద్దపీట వేశారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో మహిళల ఖాతాల్లో రూ.3.35లక్షల కోట్లు జమ చేశారని వెల్లడించారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో రూ.2 వేల కోట్లు కూడా ప్రజలకు అందించిన పాపానపోలేదని వివరించారు. ఒక్క తిరుపతి అభివృద్ధికే జగనన్న రూ.1,700కోట్లు వెచ్చించారని, చంద్రబాబు రూ.70 కోట్లు కూడా ఖర్చుచేయలేదని స్పష్టం చేశారు. తిరుపతి నగరంలో 26వేల మంది సొంతింటి కలను నెరవేరుస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్నను ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, మునిరామిరెడ్డి, చిమట రమేష్, నరసింహాచారి, జేసీఎస్ అధ్యక్షుడు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ మహ్మద్‌ఖాసిం చోటా, నాయకులు బాలాజీ, కుమార్, గఫూర్, తాలూరి ప్రసాద్, శివకుమార్, మురుగా, మునస్వామి, కవిత పాల్గొన్నారు.



వైఎస్ఆర్ సీపీలో చేరిన విజయరాయల్, భారతి తదితరులతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయరెడ్డి, ముద్రనారాయణ

యాంటీ బయాటిక్స్ అతిగా వాడొద్దు

తిరుపతి తుడా: అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అతిగా యాంటీ బయాటిక్స్ వాడడంతో అవి ఇతర సమస్యలకు దారితీస్తాయని ఔషధ నియంత్రణశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. తిరుపతిలోని ఆ శాఖ కార్యాలయంలో శుక్రవారం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు యాంటీ బయాటిక్స్ వినియోస్తున్నారన్నారు. అవగాహన లేకుండా ఎరవైనా మందుల దుకాణాల్లో యాంటీ బయాటిక్స్ అడిగితే వాటి దుష్పరిణామాలపై వివరించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి, అసోసియేషన్ నాయకులు రత్నం, మెడికల్ దుకాణ యజమానులు పాల్గొన్నారు.



అగాహన కార్యక్రమంలో ఔషధ నియంత్రణశాఖ అధికారులు, మెడికల్ షాపుల యజమానులు

రేపు జిల్లా సీనియర్స్ మహిళల కబడ్డీ జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 26వ తేదీన ఉదయం 10గంటల నుంచి జిల్లా సీనియర్స్ మహిళల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను ఎస్వీ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యనిర్వాహక కార్యదర్శులు టి.మమత రవీంద్రారెడ్డి, సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో 75 కేజీలలోపు బరువున్న మహిళా క్రీడాకారులు అర్హులని, ఎంపికైన జట్టు ఈ నెల 29 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కర్నూలు జిల్లా, గోనెగుండ్లలో నిర్వహించనున్న 70వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని వారు తెలిపారు.

జోనల్ ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేయాలి

తిరుపతి కల్చరల్: టీటీడీలో 60 ఇంజినీరింగ్ పోస్టుల భర్తీ జోనల్ ప్రాతిపదికన చేపట్టాలని రాయలసీమ మేధావుల ఫోరం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. టీటీడీలో 15 ఏళ్ల తర్వాత ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగ భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం శుభపరిణామమన్నారు. అయితే రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని టీటీడీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ కారణంగా రాయలసీమ వాసులకు ఇంజినీరింగ్ పోస్టుల భర్తీలో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. జోనల్ యూనిట్‌గా పరిగణిస్తే రాయలసీమ వాసులకు 85 శాతం ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రాయలసీమ వాసులకు న్యాయం చేయాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, మునిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం రెడ్డి

ఆన్‌లైన్‌లోనే వ్యాపార చలానాలు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాపారులు రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు పొందడానికి ఎవరికీ పైసా ఇవ్వాల్సిన పనిలేదని అంతా ఆన్‌లైన్ ద్వారా చలానాలు చెల్లిస్తే సరిపోతుందని ఆహార భద్రతా శాఖ అధికారులు మద్దిలేటి, నర్మద వెల్లడించారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఏడాదికి రూ.12లక్షలకు తక్కువ వ్యాపారం చేస్తున్నవారు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి సంబంధించి కేవలం gorcor.frrai.gov.in వెబ్‌సైట్ ఒక్కటి మాత్రమే ఉందని తెలిపారు. ఆహార భద్రతా శాఖకు సంబంధించిన dfsotpt@fmai.comకు సమాచారం ఇవ్వాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు ఇవ్వడం సరికాదు

పాకాల: విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించిన అనంతరం ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు ఇవ్వడం సరికాదని బీటీఏ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రయ్య, రామమూర్తి మాట్లాడుతూ అధికారులు పాఠశాలను సందర్శించిన తరువాత అక్కడ పరిస్థితులకు అనుగుణంగా సూచనలు, సలహాలు ఇచ్చి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలే తప్ప, ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు అందజేసి, ఉపాధ్యాయులను వేధించడం, అనారోగ్యానికి గురి చేయడం సరికాదన్నారు. బీటీఏ నాయకులు ఆంజనేయులు, విజయమోహన్‌రెడ్డెప్ప, కృష్ణమూర్తి, గణేష్, వెంకటయ్య, రాజేంద్రుడు, రామచంద్ర, శివప్రసాద్, వెంకటస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో ఈ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ 1, 28వ తేదీల్లో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం జరుగనుంది. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా వేంచేపు చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు అక్కడ స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తారు. ఈ నెల 2, 9, 16, 23, 30వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం చేస్తారు. 12వ తేదీ అమావాస్య సందర్భంగా ఉదయం 7 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడుతారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ నిర్వహిస్తారు. 26న పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిని వరకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి ఆస్థానం నిర్వహిస్తారు.

రేపు కార్తీక మాస వన మహోత్సవం

తిరుపతి కల్చరల్: కార్తీక సంధ్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం తొండవాడ ముక్కోటి శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి ఆలయం, నటరాజస్వామి మండపం వెనుకనున్న నారాయణి గార్డెన్స్‌లో కార్తీక మాస వన మహోత్సవం చేపడుతున్నట్లు అకాడమీ గౌరవాధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీక మాస వన మహోత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు ఉసిరి చెట్టు పూజ, అల్పాహారం, అనంతరం 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు తేనీటి విందు అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నామన్నారు. కార్తీక మాస వనమహోత్సవానికి తిరుపతి నగరంలోని ఆర్యవైశ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అకాడమీ కార్యదర్శి ఎస్.శ్యామ్‌సుందర్, కోశాధికారి సి.మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడు సుకుమార్, చెన్నకేశవులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దిండుకుర్తి నరసింహులు

ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు

తిరుపతి ఎడ్యుకేషన్: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల అప్సా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస స్కూల్ అధినేత వి.సుబ్రమణ్యంరాజును శుక్రవారం ఆ పాఠశాలలో ఎమ్మెల్సీ కలిసి అభినందించారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి డాక్యుమెంట్స్‌తో సంబంధం లేకుండా ప్రైవేట్ స్కూల్స్‌కు రెన్యువల్ చేయించి బ్లాక్ లిస్ట్ నుంచి తీసివేసేందుకు సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు.

డ్రైవింగ్ స్కూల్‌ను వినియోగించుకోండి

తిరుపతి అర్బన్: హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడానికి ప్రభుత్వమే ఆర్టీసీ పరిధిలో డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసి... చక్కటి శిక్షణ ఇస్తుందని అంతా సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి డీఎం, అలిపిరి ఇన్‌చార్జి డీఎం బాలాజీ తెలిపారు. అలిపిరి బస్టాండ్‌లోని హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శుక్రవారం 23వ బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసుకుని వెళుతున్న వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఒక్కో బ్యాచ్‌కి 16 మంది చొప్పున 23 బ్యాచ్‌లకి 368 మందికి ఇప్పటి వరకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మరోవైపు 24వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో అలిపిరి డిపో అధికారులు ప్రభాకర్, పుష్పలత, రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ అడ్వైజర్ రూప మిశ్రా, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సీఈవో జయప్రకాష్ సాయి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రకాశంరోడ్డు, ఇందిరానగర్, కోర్టు ఏరియా, కుమ్మరితోపు, వేశాలమ్మ గుడి వీధి, పెద్దపీర్ల చావిడి, పోలీస్ క్వార్టర్స్, భవానినగర్, సుందరయ్యనగర్, రైల్వే కాలనీ, మధురానగర్, తిలక్‌రోడ్డు, వీవీ మహల్‌రోడ్డు, టీకే స్ట్రీట్, రెడ్డి రెడ్డి కాలనీ, కొర్లగుంట, తుడా రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిరుపతికి టీటీడీ నిధులివ్వడం ధర్మబద్ధం

తిరుపతి కల్చరల్: టీటీడీలో అంతర్భాగమైన తిరుపతి నగరంలో పారిశుధ్యానికి ఒక శాతం నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం ధర్మబద్ధమని, అయితే దీనిని అడ్డుకుంటూ తప్పుడు ప్రచారంతో ప్రజల్లో ప్రతిపక్ష నేతలు ఆందోళనలు కలిగించడం సరికాదని తిరుపతి న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, దొరబాబు, విజయకుమార్ హితవు పలికారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. టీటీడీకి సంబంధించిన అనేక విద్య, వైద్య, వసతి సంస్థలు, కార్యాలయాలు, ఉద్యోగులు సైతం తిరుపతి నగరంలో ఉంటున్నారన్నారని తెలిపారు. ఆలయాల అభివృద్ధి కోసం, భక్తుల సౌకర్యం కోసం దేవదాయ శాఖ చట్టం ప్రకారం టీటీడీ నిధులు ఖర్చు చేయాలన్నారు. వీటిని మరిచి తిరుపతి పారిశుద్ధ్యంపై టీటీడీ నిర్ణయాన్ని తప్పుడు ప్రచారం చేస్తూ రాద్ధాంతాలు చేయడం సమంజసం కాదన్నారు. టీటీడీ నిర్ణయంపై ఇప్పటికైనా రాజకీయ కుట్రలతో చేసే విమర్శలను ప్రతిపక్ష నేతలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు మోహన్‌రెడ్డి, దీప, రమణ, సోమేష్, చంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి

99శాతం హామీలు నెరవేర్చిన సీఎం జగనన్న

తిరుపతి మంగళం: దేశ రాజకీయ చరిత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తిరుపతి డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ తెలిపారు. తిరుపతి 4, 13వ డివిజన్లలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయా వార్డులలో ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్ళల్లో జగనన్న ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తిరుపతి అభివృద్ధి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలకే సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు పొందవచ్చునన్నారు. కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, నరిసింహాచారి, శ్రీదేవి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పడమటి కుమార్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్, చింతచేను గోపి, తాళ్లూరి ప్రసాద్, రాపూరి ప్రసాద్, శశి పాల్గొన్నారు.



జగనన్న అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పార్టీ నేతలు

ఉపకులపతి పదవి దళితులకే కేటాయించాలి

తిరుపతి మంగళం: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవిని దళితులకే కేటాయించాలని, కంచి మఠానికి విశ్వవిద్యాలయం కేటాయించిన భూమి 13.53 ఎకరాలను తక్షణమే రద్దు పరచాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జేఏసీ కన్వీనర్ బి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళం రోడ్డులోని తిరుపతి ఎంపీ కార్యాలయంలో ఎంపీ మద్దిల గురుమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎం.గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్ని సామాజిక కులాలకు పెద్దపీట వేసి కీలకమైన పదవుల్లో పెద్ద ఎత్తున సామాజిక న్యాయాన్ని అందించారని తెలిపారు. ఎస్వీయూలో లోటుపాట్లను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు .



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న మురళీకృష్ణ

సాంకేతిక విద్యతో సత్వర ఉపాధి

తిరుపతి రూరల్: సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయని రాయలసీమ సిద్ధార్థ ఇంజినీరింగ్ విద్యా సంస్థల కార్యదర్శి వై.ఆనందరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం సీగోల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కార్యదర్శి ఆనందరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయ్ రెడ్డి, ప్రిన్సిపల్ రాజశేఖర్, ఈఈఈ విభాధిపతి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఈఈఈ విభాగం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆనందరెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని ఈఈఈ విభాగంలో ప్రతి ఏటా 60 మందికి పైగా విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగాలను సాధిస్తున్నారని తెలిపారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆనందరెడ్డి, విజయ్‌రెడ్డి సత్వర ఉపాధి అవకాశాలు

ఆరోగ్యానికి ఫార్మా రంగానిదే కీలకపాత్ర

రామచంద్రాపురం: మానవ ఆరోగ్యంలో ఫైటో ఫార్మాస్యూటికల్స్‌దే కీలక పాత్ర అని ఎస్వీ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్ డీన్ అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఫైటో ఫార్మాస్యూటికల్స్ ఇన్ డ్రగ్ డిస్కవరీపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు మాట్లాడుతూ ఆధునిక వైద్యంలో గొప్ప పురోగతి సాధించినప్పటికీ మొక్కలు నేటి ఆరోగ్య సంరక్షణలో ముఖ్యమైన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నటరాజ్, సుధాకర్ బాబు, కరస్పాండెంట్ సుమలత, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు

ఏఐటీయూసీ మహాసభలకు తరలిరండి

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో డిసెంబర్ 17, 18, 19వ తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించే ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలకు ట్యాక్సీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నగర సహాయ కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం గంధమనేని శివయ్యభవన్‌లో ట్యాక్సీ అండ్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 5వ తేదీన టాక్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ తిరుపతి బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరుగనుందని, ఇందులో టాక్సీ కార్మికులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ నేత ఎన్‌డీ. రవి, టాక్సీ వర్కర్స్ యూనియన్ నేతలు చిట్టిబాబు, నాగరాజు, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలంగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా, చిత్తూరు జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి టౌన్, యస్.టి.వి. నగర్, రఘునాథరెడ్డి కాలనీ, డి. నెం. 19-42-యస్ 8-656రు గల ఇంటిలో ఉండు మర్రి భయ్యా రెడ్డి గారి కుమారుడు మర్రి ఓబుల్ రెడ్డి అయినా నేను వైయస్. ఆర్. కడప జిల్లా టి.సుండుపల్లి మండలం పెద్దబిడికి పోస్టు, రామవరంలో గ్రామంలో కాపురం ఉండు బుక్కె మంగేనాయక్ గారి కుమార్తె బి.శారద డి.ఓ.సి.నెం. 2006/2021 తేది. 21.05. 2021 ద్వారా విక్రయ పత్రం వలనా సదరు ఆస్తి నాకు సంక్రమించిన సదరు పత్రములకు చెందినా లింకు పత్రములు 1) రిజిష్టర్ విక్రయ పత్రం నెం. 2722/1995. సదరు తేదిపినా దస్తావేజులు తేది. 24-05-1995 ఎ.భాస్కర్ గారు విక్రయం పొందినారు సదరు పత్రము తిరుపతిలో సాయినగర్ నుండి అలిపిరికు ఇల్లు మారుతుండగా జారిపోయినది. సదరు విషయమై తిరుపతి రూరల్ పోలిస్ స్టేషన్ నందు కంప్లైంట్ ఇచ్చినాము కావున సదరు స్థిరాస్తిపై ఏవరికైనాను ఆక్షేపణలు, అభ్యంతరములు ఉన్న యెడల ఇట్టివారు ప్రకటన తేది నుండి 7 రోజులలోగా తగు సాక్ష్యాధారముల తో సైతనిది వారికి కాని తెలుపగలరు. గడువుతిరా ఏలాంటి ఆక్షేపణలు రాని యెడల ఎవరికి ఏలాంటి ఆక్షేపణలు లేవని భావించడం జరుగుతుంది.

షెడ్యూలు : చిత్తూరు, శ్రీ బాలాజీ రి.డి., తిరుపతి, తిరుపతి రూరల్ సబ్.డి., తిరుపతి రూరల్ మండలం. నెం. 49రు అవిలాల గ్రామలెక్క దాఖలా, సర్వే నెం. 326/1, 326/2ల్లో సాయినగర్ పంచాయితి 4వ వార్డుకి చేరిన సత్యసాయి నగర్ రెసిడెన్షియల్ ఏరియాల్లో, జాగాకు హద్దులు, కొలతలు వివరం. తూర్పు మెడికల్ కాలేజి కాలని వారి ఆస్తులు, పడమర : 33 అడుగులు వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ఎన్.బి. నాయుడు వగైరాల ఇల్లు, దక్షిణం: సుబ్బులు శెట్టి గారి భూమి. ఈ నాలుగు హద్దుల మధ్యన తూర్పు-పడమర:65 అడుగులకు మీ.19.825ర్లు, ఉత్తర - దక్షిణం 21.6 అడుగులకు మీ. 6.588ర్లు, మొత్తం 1404 చదరపు అడుగులు లేక 156 చదరపు గజములు గల జాగా.

యం. ఓబుల్ రెడ్డి, 88869 51611	ఎన్.మనోహర్, న్యాయవాది, 9346981333